మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే... 5 PM
ఆదివారం, ఆగస్టు 09, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net




## లాల్ దర్వాజా బోనాలు..
# పొటెత్తిన భక్తులు

**హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్ దర్వాజా బోనాల బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ అనంతరం దేవాలయం తరఫున తొలి బోనం సమర్పించారు. ఉదయం 6:00 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ప్రభుత్వం తరఫున ఉదయం 10:30 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లాల్ దర్వాజాలోని ప్రధాన ఆలయంతో పాటు పరిసరాల్లోని దాదాపు 3,000 చిన్న దేవాలయాల్లో భక్తులు బోనాలు సమర్పించనున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఆవరణ చిన్నది కావడంతో భక్తుల కోసం 6 ప్రత్యేక క్యూలైన్లను, బోనం తీసుకొచ్చే వారికి ప్రత్యేక మార్గాన్ని రూపొందించారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌లు, ఉచిత వైద్య శిబిరాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. ముందస్తు సమాచారం అందించిన జోగిణులకు అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేశారు. ఇది సున్నితమైన ప్రాంతం కావడంతో 100 సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణతో పాటు 2,500 మంది సిబ్బందితో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం రోజున ప్రతిష్టాత్మక 'రంగం' భవిష్యవాణి, పోతురాజుల విన్యాసాలు, భవానీ రథయాత్రతో ఈ బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

మిగతా 2లో...



# 'హర్ ఘర్ తిరంగా'



**గాంధీధామ్ (గుజరాత్), ఆగస్టు 9:** కాండ్లాలోని దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ (ఆదివారం) గాంధీధామ్‌లోని గోపాల్‌పురి పోర్ట్ టౌన్‌షిప్‌లో 'తిరంగా యాత్ర'ను ప్రారంభించింది. పోర్ట్ ఉన్నతాధికారుల సమక్షంలో చైర్మన్ సుశీల్ కుమార్ సింగ్ ఈ యాత్రకు నాయకత్వం వహించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, దీన్‌దయాళ్ మహిళా శక్తి కేంద్రం సభ్యులు, భద్రతా సిబ్బంది, సాధారణ ప్రజలు ఇందులో పాల్గొని, దేశభక్తిని చాటారు.త్రివర్ణ రంగులతో అలంకరించిన, దేశభక్తి ఉత్సాహంతో నిండిన పోర్ట్ టౌన్‌షిప్ ఒక అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరించింది. జాతీయ జెండాలు చేతబూని పాల్గొన్న జనసందోహంతో టౌన్‌షిప్ ప్రాంగణమంతా దేశభక్తి శోభతో విలసిల్లింది. 'వందేమాతరం' నినాదాలు, దేశభక్తి కేరింతలతో ఆ ప్రాంతం హోరెత్తింది. పాల్గొన్నవారు యాత్ర అంతటా జాతీయ జెండాను గర్వంగా చేతబూని నడిచారు. దేశం పట్ల గర్వం, ఐక్యత, అంకితభావం ప్రతిబింబించేలా, దేశభక్తి నినాదాలు 'వందేమాతరం' స్ఫూర్తితో ఆ ప్రాంతమంతా మార్మోగింది.మువ్వన్నెల జెండాను కేవలం ఒక జాతీయ చిహ్నంగానే కాకుండా, భారతదేశ ఐక్యత, సార్వభౌమాధికారం, ఉమ్మడి జాతీయ గుర్తింపునకు ప్రతీకగా నిర్వహించడమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశం. ప్రధాని నరేంద్ర మోదీ 2022లో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' నేపథ్యంలో ఈ పిలుపునిచ్చారు. పౌరులు తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ జెండాతో ఆత్మీయ అనుబంధాన్ని పెంచుకోవడానికి, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకోవడానికి ఇది దోహదపడుతుంది.ఈ ఏడాది 'వందేమాతరం' 150 సంవత్సరాల వేడుకలు పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా, బ్లాక్, పంచాయతీ స్థాయిల్లో తిరంగా ర్యాలీలు, ప్రదర్శనలు, సైకిల్/బైక్ ర్యాలీలు, కాన్సర్ట్‌లు, రంగోలీ పోటీలు నిర్వహించబోతున్నారు.

మిగతా 2లో...

## మావోయిజం లేదు..
## డ్రగ్స్ సమస్యే నేడు ప్రధానం
## : డీజీపీ సీవీ ఆనంద్

**వరంగల్ :** రాష్ట్రంలో మావోయిస్టుల ప్రముఖులతో పాటు క్యాడర్ లొంగిపోవడంతో మావోయిజం ప్రభావం ఇక లేదని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. నేడు డ్రగ్స్ సమస్య ప్రధానంగా ఉందని వెల్లడించారు. ఆదివారం వరంగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.తన ట్రైనీ ఐపీఎస్ వరంగల్



నుంచే ప్రారంభమయ్యిందని గుర్తు చేశారు. ఆ రోజుల్లో ఇంటి నుంచి బయటకు వెళ్తే, తిరిగి వస్తామా అన్నంతగా నక్సల్స్ ప్రభావం ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2010 నుంచి మావోయిజం తగ్గిందని అన్నారు. లొంగిపోయిన మావోలతో ములుగులో సోమవారం ఒక కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు.లొంగిపోయిన, మావో బాధితుల కోసం ఒక ఆప్ తయారు చేశామని వెల్లడించారు. 1992-96 మధ్య చనిపోయిన వారికి ఎక్స్ గ్రేషియా కొంత తక్కువ వచ్చిందని తమ దృష్టికి వచ్చిందని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. నార్కొటిక్ బ్యూరో, ట్రాఫిక్, సీఐడీకి చెందిన వారితో కలిసి ఒక బృందంగా ఏర్పడి జిల్లాల పర్యటనలు చేస్తున్నామని డీజీపీ ఆనంద్ తెలిపారు.

# లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారికి కవిత బోనం



- **అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్ :** బోనాల పండుగ సందర్భంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.తెలంగాణ ప్రజలందరిపై సింహవాహిని మహం కాళి అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కవిత ప్రార్థించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖశాంతులతో, ఆరోగ్యంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.బోనాల పండుగను పురస్కరించుకుని లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోనాలు సమర్పిస్తూ, అమ్మవారిని దర్శించుకుంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.

మిగతా 2లో...



## గాంధీభవన్‌లో ఘనంగా
# క్విట్ ఇండియా దినోత్సవం

**హైదరాబాద్ :** క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.1942 ఆగస్టు 9న మహాత్మాగాంధీ ఇచ్చిన 'క్విట్ ఇండియా' పిలుపు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమం దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను మరింత బలపరిచిందని గుర్తుచేశారు. గాంధీభవన్ గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీజీ జీవితం, సిద్ధాంతాలు, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను ప్రతిబింబించే ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. అదేవిధంగా 1,500 గాంధీ విగ్రహాలను ప్రదర్శనకు ఉంచడంతో పాటు 150 చరఖాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని నేటి తరం తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుని ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవాలని సూచించారు.

మిగతా 2లో...


## పెద్ది కుటుంబానికి
# కేసీఆర్ భరోసా..

- **గులాబీ అధినేతకు దారిపొడవునా కార్యకర్తల సంఘీభావం**



**నర్సంపేట :** దివంగత నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయన స్వగ్రామం నల్లబెల్లికి వస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దారిపొడవునా సంఘీభావం తెలిపారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న మార్గంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు ఆయనకు అభివాదం చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.
పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించి, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు నర్సంపేట వైపు తరలుతున్నారు. తమ కుటుంబానికి కష్టమొస్తే నేనున్నానని అండగా నిలుస్తున్న కేసీఆర్‌కు కార్యకర్తలు భరోసాగా నిలిచారు.ఈ సందర్భంగా కేసీఆర్ సైతం తన కాన్వాయ్‌ను పలుచోట్ల ఆపి కార్యకర్తలను పలకరించారు. అధైర్యపడొద్దు.. మీకు నేనున్నానంటూ.. భరోసా ఇచ్చి, ధైర్యం చెప్పారు. కార్యకర్తలను అనునయిస్తూ, వారిలో గుండె ధైర్యం నింపుతూ నల్లబెల్లి వైపు కదిలారు.

మిగతా 2లో...



## సంకల్పిస్తే శిఖరాలు..
## దేశం కోసం పనిచేస్తే గెలుపు
## : సీఎం చంద్రబాబు

**విజయవాడ :** గిరిజనుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యంలో చేశారు.

మిగతా 2లో...

# అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా పడాలి
## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం నగరంలోని పలు అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని, లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని



దర్శించుకుని ప్రత్యేక పూజచేశారు. ఈ సందర్భంగా కేటీ ఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, హైదరాబాద్‌లో వ్యాపారాలు బాగా జరగాలని ఆకాంక్షించారు. . అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా పడి, రైతులందరూ సంతోషంగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఓల్డ్ సిటీలోని బంగారు మైసమ్మ అమ్మవారిని, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని , నాంపల్లిలోని శ్రీ ఏడు గుళ్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.కేటీఆర్ వెంట మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు , ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుటు కేటీఆర్‌ను శాలువాతో సత్కరించారు.

మిగతా 2లో...



## మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ వద్ద పర్యాటకుల

# అత్యుత్సాహం

**రాజన్న సిరిసిల్ల జిల్లా:** తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె శివారులోని మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. హైదరాబాద్ నుంచి సుమారు 20 వాహనాల్లో వచ్చిన సందర్శకులు బ్యాక్‌వాటర్ పరిసరాలను వీక్షించేందుకు తరలివచ్చారు. చుట్టూ గుట్టలు.. మధ్యలో బ్యాక్‌వాటర్ ఉండటంతో ఆ ప్రాంతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అయితే కొందరు సందర్శకులు నిబంధనలు పట్టించుకోకుండా కార్లతో ప్రమాదకర విన్యాసాలు చేస్తూ కనిపించారు. వేగంగా కార్లు నడుపుతూ స్టంట్లు చేయడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్న స్థానికులు, ఇలాంటి ప్రమాదకర విన్యాసాలను వెంటనే అడ్డుకోవాలని అధికారులను కోరుతున్నారు. పర్యాటక ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టి, వాహనాలతో స్టంట్లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



**బెజ్జంకి, ఆగస్టు 9 (ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం బేగంపేట గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బొల్లం సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి మానకొండూరు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ రసమయి బాలకిషన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశ భద్రత కోసం నిబద్ధతతో విధులు నిర్వహించిన బొల్లం సత్తయ్య సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. సత్తయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ బెజ్జంకి మండల అధ్యక్షులు మైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, లక్ష్మారెడ్డి, ఏలా శేఖర్ బాబు, పవన్, పోచయ్య, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల సందడి..

# నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు

**హైదరాబాద్, ఆగస్టు 8:**

లాల్‌దర్వాజా బోనాలు, కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ బోనాలు, అంబర్‌పేట మహంకాళి ఆలయ ఉత్సవాలు, చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ–పోచమ్మ ఆలయ బోనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆగస్టు 9, 10 తేదీల్లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయని నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. భక్తులు, వాహనదారులు ప్రయాణాలను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.




**లాల్‌దర్వాజా బోనాలకు భారీ ఆంక్షలు**

పాతబస్తీలోని సింహవాహిని శ్రీ మహంకాళి లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు, ఊరేగింపుల సందర్భంగా ఆగస్టు 9న ఉదయం 6 గంటల నుంచి, ఆగస్టు 10న ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయి.

ఫలక్‌నుమా, ఇంజిన్‌బౌలి, మహబూబ్‌నగర్ ఎక్స్‌రోడ్డు, ఆలియాబాద్, గౌలీపురా, నాగుల్ చింత, సుధా టాకీస్, ఛత్రినాక, కందికల్‌గేట్, బాలాగంజ్, మొఘల్‌పురా, మీర్‌చౌక్, చార్మినార్, గుల్జార్‌హౌస్, నయాపూల్, అఫ్జల్‌గంజ్ తదితర ప్రాంతాల్లో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తారు.

మదీనా ఎక్స్‌రోడ్డు నుంచి ఇంజిన్‌బౌలి వరకు గుల్జార్‌హౌస్–చార్మినార్, చార్మినార్ బస్ టెర్మినల్, హిమ్మత్‌పురా, నాగుల్‌చింత, ఆలియాబాద్ మీదుగా వెళ్లే ప్రధాన రహదారిని బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు అన్ని రకాల వాహనాలకు పూర్తిగా మూసివేయనున్నారు.

పాత చంద్రాయణగుట్ట నుంచి ఛత్రినాక వైపు వచ్చే భారీ వాహనాలను అనుమతించరు. వాటిని సంతోష్‌నగర్, చంద్రాయణగుట్ట మార్గాల వైపు మళ్లిస్తారు. అలాగే చార్మినార్, ఫలక్‌నుమా, నయాపూల్ వైపు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సులకు అనుమతి ఉండదు. పాత సీబీఎస్, అఫ్జల్‌గంజ్, దారుల్‌షిఫా ఎక్స్‌రోడ్డు, ఛత్రినాక, ఇంజిన్‌బౌలి వద్ద బస్సులను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో నడుపుతారు.

**భక్తులకు పార్కింగ్ ఏర్పాట్లు**

ఆలియాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు శాలిబండ పోస్టాఫీసు ఎదురుగా, దేవి ప్లైవుడ్ ప్రధాన రహదారి లేదా అల్కా థియేటర్ ఖాళీ స్థలంలో వాహనాలను నిలిపివేయవచ్చు.

హరిబౌలి, గౌలీపురా వైపు నుంచి వచ్చే వారు ఆర్యవైశ్య మందిరం, అల్కా థియేటర్ ఖాళీ స్థలం, వీడీపీ పాఠశాల మైదానం, మిత్ర స్పోర్ట్స్ క్లబ్‌లలో పార్కింగ్ చేసుకోవచ్చు.

పాత ఛత్రినాక పోలీస్‌స్టేషన్ వైపు నుంచి వచ్చే భక్తులకు లక్ష్మీనగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, పత్తర్‌కీ దర్గా సమీపంలోని ఫూల్‌బాగ్ చమన్ మైదానం అందుబాటులో ఉంటాయి. మూసాబౌలి, మీర్‌చౌక్ వైపు నుంచి వచ్చే వారు చార్మినార్ బస్ టెర్మినల్‌లో వాహనాలు నిలిపివేయాలని సూచించారు. ఊరేగింపు వాహనాలకు ఢిల్లీగేట్ వద్ద సింగిల్‌లైన్ పార్కింగ్ ఏర్పాటు చేశారు.

**కార్వాన్‌లో ఏనుగు ఊరేగింపు**

కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ బోనాల ఉత్సవాలు, ఏనుగు ఊరేగింపు నేపథ్యంలో ఆగస్టు 8 రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10 ఉదయం వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయి. పురానాపూల్ జంక్షన్, టప్పాచబుత్రా, జియాగూడ, కార్వాన్ రోడ్డు, మొఘల్‌కా నాలా, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు, నాలుగు చక్రాల వాహనాలు, ఇతర సాధారణ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తారు. ఏనుగు ఊరేగింపు హనుమాన్ ఆలయం వద్దకు చేరుకున్న సమయంలో ఆసిఫ్‌నగర్ నుంచి టప్పాచబుత్రా వైపు వచ్చే వాహనాలను రాయల్‌సీ హోటల్, జిర్రా రోడ్డు మార్గంలోకి మళ్లిస్తారు. కార్వాన్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల మైదానం, ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న తోలీ మసీదు ప్రాంతం, జగత్‌సింగ్ ప్రైవేటు స్థలంలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. జగత్‌సింగ్ స్థలం ద్విచక్ర వాహనాలకు కేటాయించారు.

**అంబర్‌పేటలో రెండు రోజులు మళ్లింపులు**

అంబర్‌పేట మహంకాళి ఆలయం బోనాల సందర్భంగా ఆగస్టు 9 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10 మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఉప్పల్ నుంచి చాదర్‌ఘాట్, మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ వైపు వెళ్లే జిల్లా, నగర బస్సులు, భారీ వాహనాలను అంబర్‌పేట ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. చాదర్‌ఘాట్, మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి వచ్చే బస్సులు, డీసీఎంలు, భారీ వాహనాలు కూడా ఫ్లైఓవర్ పైనుంచే వెళ్లాలి.

రామంతాపూర్ వైపు నుంచి ఆలయానికి వచ్చే భక్తులు గాంధీ విగ్రహం వైపు వెళ్లి అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ మైదానంలో వాహనాలు నిలిపివేయాలని సూచించారు. రోడ్డునంబరు 6, తిలక్‌నగర్, ఎన్‌సీసీ, గోల్నాక ప్రాంతాల్లో కూడా పరిస్థితిని బట్టి ట్రాఫిక్‌ను మళ్లిస్తారు.

ఫ్లైఓవర్ వద్ద రద్దీ పెరిగితే ఉప్పల్ నుంచి వచ్చే వాహనాలను రాయల్ జ్యూస్ కార్నర్, మల్లికార్జున్‌నగర్, డీడీ కాలనీ, సిండికేట్ బ్యాంకు, శివం రోడ్డు, తిలక్‌నగర్ మార్గాల్లోకి మళ్లిస్తారు.

**చిలకలగూడలో**
**ఉదయం నుంచి రాత్రి వరకు ఆంక్షలు**

చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ–పోచమ్మ ఆలయ బోనాల సందర్భంగా ఆగస్టు 9, 10 తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటాయి. సీతాఫల్‌మండి జంక్షన్ నుంచి చిలకలగూడ ఎక్స్‌రోడ్డు వైపు వచ్చే వాహనాలను నామలగుండు, వారసిగూడ ఎక్స్‌రోడ్డు, సీతాఫల్‌మండి టీ జంక్షన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సిటీ రోడ్డు, తార్నాక ఎక్స్‌రోడ్డు వైపు మళ్లిస్తారు. అల్లుగడ్డబావి, సికింద్రాబాద్ నుంచి చిలకలగూడ ఎక్స్‌రోడ్డు మీదుగా సీతాఫల్‌మండి వైపు వెళ్లే వాహనాలను పద్మారావునగర్ టీ జంక్షన్ వైపు మళ్లించనున్నారు.

**ముందస్తు ప్రయాణ ప్రణాళిక అవసరం**

బోనాల ఉత్సవాల నేపథ్యంలో ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అత్యవసర ట్రాఫిక్ సహాయం కోసం తొమ్మిది సున్నా ఒకటి సున్నా రెండు సున్నా మూడు ఆరు రెండు ఆరు హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా తాజా ట్రాఫిక్ సమాచారాన్ని తెలుసుకుని పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**-- జాయింట్ కమిషనర్**
**ఆఫ్ పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్**

## డంపింగ్ యార్డు మూసివేతకై

# ఎం.పి. ఈటెల రాజేందర్ కు వినతిపత్రం

**- చైర్మన్ షేక్ షావలి ఆధ్వర్యంలో సమర్పించిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ బాగస్వామ్య సంస్థలకు చెందిన నేతలు.**
**-- సానుకూలంగా స్పందించిన మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధి ఈటేల రాజేందర్.**



**జవహర్ నగర్ ఆగస్టు 9(ప్రజావాణి ప్రతినిధి):** ప్రజల ప్రాణాలు, వారి ఆరోగ్య భద్రతతో చెలగాటమాడుతున్న జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డు మూసివేతకు అన్నివిధాల చేపట్టాల్సిన చర్యలను వెంటనే చేపట్టాలని మేడ్చల్–మల్కాజిగిరి ఎం.పి. ఈటెల రాజెందర్ గారికి ఆదివారం రోజు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పిస్తూ విజ్ఞప్తి చేశారు. 2026, ఆగష్టు–09, జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటిలోని బాగస్వామ్య సంస్థలకు చెందిన నాయకులు చైర్మన్ షేక్ షావలి ఆధ్వర్యంలో ఈటెల రాజేందర్ గారిని శామీర్ పేటలోని తన నివాసంలో కలిసి జవహర్ నగర్ డంపింగ్ యార్డు వలన నాలుగు మండలాల ప్రజలు పడుతున్న అవస్థలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించామని అన్నారు. ఈ సందర్భంగా కలుషితమౌతున్న భూగర్భ జలాలు, వాయు కాలుష్యం, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న రాంకీ సంస్థ చెత్త డంపింగ్ యార్డు శాశ్వతంగా శాస్త్రీయమైన పద్దతులలో మూసివేతకై న్యాయమైన, ప్రజాస్వామికమైన డిమాండ్ల పరిష్కారానికి జరుగుతున్న ప్రజా ఆందోళనలను ఈటేల రాజేందర్ కు గుర్తుచేశామని తెలియజేశారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారని, కేవలం డంపింగ్ యార్డు సమస్యపైననే కాదు, ఇతర ఏ సమస్యలు ఉన్న, తన ద్రుష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల అఖిల పక్షం పేరుతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు డంపింగ్ యార్డు పరిష్కార బాద్యతలు తమకే అప్పగించారని, స్థానిక అధికార పార్టీకి చెందిన నేతలు గుర్తు చేస్తున్నారనే విషయాన్ని కూడ తెలియజేశామని అన్నారు. దీనికి సమాధానంగా ప్రస్తుతం వేలాదిమంది కదిలితే తప్ప, సమస్య పరిష్కారం కాబోదనే విషయాన్ని నర్మగర్భంగా ఈటేల గారు సూచించారని అన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా డంపింగ్ యార్డు మూసివేతకై కేంద్ర మంత్రుల ద్రుష్టికి తీసుకెళ్లి, పార్లమెంట్ లో కూడ సమస్య తీవ్రత గురించి ఎత్తిచూపిన ఈటేలగారికి పోరాట కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిందని అన్నారు.



అలాగే దమ్మాయిగూడ యాంటి డంపింగ్ యార్డు జేఏసీ కన్వీనర్ డాక్టర్ శంకర్ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు గురించి తెలియజేస్తున్న క్రమంలో, 2017 లో జవహర్ నగర్ ప్రజా హక్కుల పరిరక్షణ పోరాట కమిటి ఆధ్వర్యంలో జరిగిన డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటంలో వేలాదిమంది ప్రజలతో ఉద్యమించారని, దాని ఫలితంగానే ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం 144 కోట్ల రూపాయాలతో క్యాపింగ్ చేశారనే విషయాన్ని ఈటేల ద్రుష్టికి తీసుకెళ్ళామని అన్నారు. ఇప్పటికి తప్పుడు కేసులకు గురై, కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నామనే విషయాన్ని కూడ తెలియజేశామని అన్నారు. మరి కొందరిపై రౌడీ షీట్లు ఓపెన్ చేశారని అన్నారు. అప్పటి ప్రజా ఉద్యమానికి జడుసుకొని, వెనుకకు తీసుకోవడంలో జవహర్ నగర్ ప్రజల పోరాటాలకు ప్రత్యేక చరిత్ర ఉందని అన్నారు. ప్రస్తుతం సైంటిఫికల్ గా డంపింగ్ యార్డును మూసి వేసి, బాదిత ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు చేసి, ఉచిత వైద్య సేవలు, మంచినీటి సరఫరా తదితర ప్రజల మౌలిక అవసరాలు కల్పించేలా తమవంతు ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. బీఆర్ఎస్ రాజశేఖర్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం సదానందం, సిపిఐ శంకర్, పిడిఎం చంద్రమౌళి ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, పిఓడబ్ల్యూ జయసుధ, సిఎంఎస్ ఇ.జయ, పిఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునిత, టియుసిఐ వి.ప్రవీణ్, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ రావల్ కోల్ నర్సింహ్మా గౌడ్, వాసంశెట్టి శ్రీనివాస్, కార్మికనగర్ దామల ప్రభాకర్, జర్నలిస్ట్ కొన్నెవేణు, ఇంగ్లీష్ ఆర్టిఫిషియల్ శ్రావణ్ కుమార్, ఏ.దర్గం, శ్యాం తదితర సంస్థలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## ఆదివాసీలు... 'జల్, జంగల్, జమీన్' అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు: కేటీఆర్




**హైదరాబాద్, ఆగస్టు 8:**

ప్రకృతి పరిరక్షకులు, విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ఆదివాసీలు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడవులను, చెట్లను, పుట్టలను, జంతువులను ప్రేమించే, పూజించే ఆదివాసీలు... 'జల్, జంగల్, జమీన్' అని నినదించిన పోరాట యోధుడు కుమ్రం భీం తెగువకు ప్రతిరూపాలు అని తెలిపారు. ఎస్టీల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఆ తర్వాత ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.. తండాలను, గిరిజన గూడేలను గ్రామ పంచాయితీలు చేసిందని అన్నారు.. హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో ఆదివాసీ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా.. కుమ్రం భీం ఆదివాసీ భవనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం పేరు పెట్టడమే కాకుండా, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. తండాలకు, గూడేలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా చేయడం, ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం వంటి ఎన్నో కార్యక్రమాలు కూడా కేసీఆర్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా.. ఆదివాసీ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com